క్లుప్తంగా

వేడుకగా బంగారమ్మ తల్లి జాతర



సంగంవలసలో అమ్మవారి ఘటాల ఊరేగింపు

పార్వతీపురం: మండలంలోని సంగంవలస గ్రామంలో బంగారమ్మ తల్లి అమ్మవారి జాతరను అత్యంత వేడుకగా నిర్వహించారు. మూడవ వార్షికోత్సవం సందర్భంగా బంగారమ్మ తల్లి అమ్మవారి జాతరను మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. గ్రామంలోని బడే వారి కుటుంబస్తులు ఈ జాతరను ఏటా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. బుధవారం అనుపోత్సవంలో భాగంగా అమ్మవారి ఘటాలను మేళతాళాలతో, డప్పువాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ పూజల్లో గ్రామస్తులంతా సామూహికంగా పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జిల్లా అటవీ శాఖాధికారి



ఎమ్మెల్యేను కలిసిన డీఎఫ్‌ఓ ప్రసూన

పార్వతీపురం టౌన్: జిల్లా అటవీ శాఖాధికారి ప్రసూన పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్రను మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా పార్వతీపురం నియోజకవర్గం పరిధిలో అటవీ శాఖకు సంబంధించి సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆమెతో చెప్పారు.

ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

సాలూరు: శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లక్ష్మి ఆప్టికల్స్ సహకారంతో సాలూరు పట్టణంలోని ఆర్యవైశ్య ధర్మశాలలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 124 మందికి నేత్రపరీక్షలు చేయగా 62 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వివేక్‌కుమార్, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

గడ్డి విత్తనాలు వేయవద్దు

- రైతులకు వ్యవసాయాధికారుల సూచన



రైతులతో సమావేశమైన వ్యవసాయ అధికారులు

సాలూరు రూరల్: మండలంలోని మరిపల్లి గ్రామంలో గడ్డి విత్తనాలు వేస్తున్నట్లు సమాచారం అందడంతో పొలంలో విత్తనాలు వేస్తున్న రైతులను వ్యవసాయ శాఖ అధికారులు ఏఓ అనూరాధ, ఏడీఏ మధుసూదనరావులు బుధవారం అడ్డుకున్నారు. అనంతరం గ్రామంలోని రామ మందిరం వద్ద రైతులతో సమావేశం ఏర్పాటు చేసి గడ్డి విత్తనాల వల్ల రాబోయే తరాలకు జరిగే నష్టాలను వివరించారు. గడ్డి విత్తనాలు పండించకూడదని దానివల్ల మానవాళి మనుగడకు నష్టం వాటిల్లుతుందని చెప్పారు. అలాగే ఈ విత్తనాలు ఎక్కడ కొన్నారని ఓ రైతును అడగ్గా ఒడిశా నుంచి వచ్చిన వారి వద్ద తెలియక కొనుగోలు చేసినట్లు తెలిపాడు. గడ్డి విత్తణాలు ఎవరైనా అమ్మితే తమకు సమాచారం ఇవ్వాలని రైతులకు అధికారులు సూచించారు.

పట్టపగలే విద్యుత్ కాంతులు



గాదిపిల్లి వలసలో పగలు వెలుగుతున్న విద్యుత్ దీపాలు

సాలూరు రూరల్: మండలంలోని గాదిపిల్లి వలస గ్రామంలో విద్యుత్ దీపాలు పట్టపగలు వెలుగుతున్నాయి. రాత్రిపూట వెలగాల్సిన విద్యుత్ దీపాలు గత 10 రోజులుగా ఉదయం పూట కూడా వెలిగి ఉంటున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

- వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవాల్సిన సమయం
- వ్యాధుల కాలంలో జాగ్రత్తలు పాటించాలి
- వైద్యుల సలహాలు పాటించడం ఉత్తమం
వ్యక్తిగత, పరిసరాల శుభ్రత ముఖ్యం

పార్వతీపురం:

వర్షాకాలం ప్రారంభమైంది. ఈ సీజన్‌లో వ్యాధులు ప్రబలే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. సరైన జాగ్రత్తలు పాటించకుంటే రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. ప్రతి ఒక్కరూ రోగ నిరోధక శక్తి పెంచుకోవాల్సిన అవసరం ఉంది. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించక పోవడం, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం, వ్యాయామానికి దూరంగా ఉండడం వల్లే పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. రోజువారీగా పోషకాలతో కూడిన ఆహారం శరీరానికి అవసరమైన మోతాదులో తీసుకుంటే ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చు. ఆరోగ్యం కాపాడుకోవడం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లను జిల్లా మలేరియా అధికారి టి. జగన్‌మోహన్‌రావు ఇలా వివరించారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు

● వీటికి దూరంగా ఉండాలి

నిల్వ చేసిన ఆహారం, తీపి పదార్థాలు తీసుకోకూడదు. బయట దొరికే రెడీమేడ్ ఆహారం, ఉప్పుతో కూడిన ఆహారం, కూల్‌డ్రింక్స్, ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తీసుకోకపోవడం ఉత్తమం,

● రోజువారీ ఆహారం ఇలా..

ఉదయం రెండు ఇడ్లీలు లేదా 60 గ్రాముల గింజ ధాన్యాలు లేదా 25 గ్రాముల పప్పులు, 150 మిల్లీ లీటర్ల పాలు తీసుకోవచ్చు. ఉదయం 11 గంటల సమయంలో ఏదో ఒక పండు, నిమ్మరసం లేదా జామకాయను తీసుకోవాలి. ఇవేవీ అందుబాటులో ఉండకపోతే ఒక గ్లాసు పాలైనా తాగాలి. మధ్యాహ్నం భోజనంలో 75 గ్రాముల గింజ ధాన్యాలు, ఆకుకూరలు, పెరుగు ఉండేలా చూసుకోవాలి. సాయంత్రం 5 గంటలకు 50 గ్రాముల చిరు ధాన్యాలతో చిరుతిండి, ఒక కప్పు పాలు తీసుకోవాలి. రాత్రి భోజనంలో రెండు కప్పుల అన్నం లేదా రెండు చపాతీలు లేదా పుల్కాలు కూరగాయలతో తినాలి. ఒకవేళ కూరగాయ, పెరుగు 100 గ్రాములు లేదా మాంసాహారం ఉండాలి.

● నీరు, పాలకు ప్రాధాన్యం ఇవ్వాలి



పరిశుభ్రమైన నీటినే తాగాలి. సరిపడా నీరు తాగితే 50 శాతం రుగ్మతలు దూరమవుతాయి. ఎక్కువగా కాచి వడబోసిన నీటినే తీసుకోవాలి. నీటితో పాటు పాలు కూడా చాలా అవసరం. రోజుకు 250 మిల్లీమీటర్ల పాలు తాగాలి. కాఫీ, టీ అలవాటు ఉన్న వారు రోజుకు ఒకటి రెండు సార్లు కంటే ఎక్కువ తీసుకోరాదు.

● పప్పు ధాన్యాలు



ఆహారంలో పల్లీలు, మినుములు, శనగలు, బాదం పప్పు వంటివి ఏదో ఒకటి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి రోజూ ఏదో ఒక ఆకు కూర 100 గ్రాములు ఉండేలా చూసుకోవాలి. జామ, నిమ్మ, ఉసిరి ఏదో ఒక దానిని తప్పకుండా తీసుకోవాలి. రోజూ ఉడికించిన గుడ్డు, వారంలో ఒకసారి చికెన్, మటన్ తినాలి.

● జలుబు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

జలుబు, దగ్గు, ఆయాసం వంటి సమస్యల నుంచి ఉపశమనం కోసం మిరియాలు, అల్లం, వెల్లుల్లి బాగా ఉపయోగపడతాయి. వీటిని అవసరం మేరకు వేడినీరు, పాలు, టీలో ఏదేని ఒక దానిలో కలుపుకుని తాగితే ఉపశమనం లభిస్తుంది.





పౌష్టికాహారం వినియోగంపై అవగాహన కల్పిస్తున్న డీఎంఓ జగన్‌మోహన్‌రావు

మంచి ఆహారంతో ఆరోగ్యం

ఆహారం బాగా ఉడికించి తినాలి. ఎ, సి, డి, కె విటమిన్లు కలిగిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు. ఆంధత్వంతో పాటు పిల్లల్లో వాంతులు విరేచనాలు, తట్టు, శ్వాసకోస సంబంధ వ్యాధులను నివారించేందుకు 'ఎ' విటమిన్ బాగా పనిచే స్తుంది. తోటకూర, మెంతికూర, పాలకూర, క్యారెట్, కెరోటిన్ ఉన్న మునగాకు, మామిడి, బొప్పాయి, గుమ్మడి వంటివి తీసుకోవడం వల్ల శరీరానికి సరిపడా విటమిన్లు అందుతాయి.

– టి.జగన్‌మోహన్‌రావు, డీఎంఓ, పార్వతీపురం మన్యం జిల్లా

తాజా కూరలు, పండ్లు

ప్రతిపూట భోజనానికి ముందు, తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలి. పరిశుభ్రమైన ఆహారం, కాచి వడబోసిన నీటిని తీసుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చు. ఆహారాన్ని ఒకేసారి కాకుండా కొంచెం కొంచెం ప్రతి మూడు గంటలకు ఒకసారి తీసుకోవడం ఉత్తమం.

- రోజు వారి ఆహారంలో తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. కూరగాయలు, పండ్లలో ఉండే సూక్ష్మ పోషక పదార్థాలు, ఫైబర్ శరీరానికి ఎంతో మేలు చేస్తాయి.
- పసుపు, నారింజ రంగులో ఉండే పండ్లు కొన్ని రకాల దీర్ఘకాలిక జబ్బులను నిరోధిస్తాయి. తాజాగా ఉండే పచ్చి కూరగాయలు, పండ్లను జ్యూస్ రూపంలో కూడా తీసుకోవచ్చు.



సీజనల్ వ్యాధులపట్ల వైద్యులు అప్రమత్తం

- డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

సీతానగరం:

సీజనల్ వ్యాధులతో పీహెచ్‌సీలకు వచ్చిన రోగుల పట్ల వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా మలేరియా అధికారి(డీఎంఓ) డాక్టర్ టి.జగన్మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు సీతానగరం పీహెచ్‌సీని, మెడికల్ ల్యాబ్, మందుల నిల్వ గదులను బుధవారం ఆయన సందర్శించారు. రోగులకు రక్తనమూనాలు, ఇతర వ్యాధుల నిర్ధారణ, జ్వరాలతో ఎవరైనా వస్తున్నారా? రక్త పరీక్షలుచేశారా? జ్వరాలున్నట్లు నిర్ధారణ పరీక్షలు తదితర అంశాలపై రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు రక్తపరీక్షలు మైక్రోస్కోప్ ద్వారా పరీక్షావిధానం పక్కాగా నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో రక్తపూత స్లైడ్స్‌ను సకాలంలో పరీక్షించి ఫలితాలు వెల్లడించాలని చెప్పారు. అనంతరం వార్డుల్లో వైద్యసేవలు పొందుతున్న రోగులను పరిశీలించి మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, సూపర్‌వైజరు జయగౌడ్, ల్యాబ్‌టెక్నీషియన్, ఫార్మసిస్ట్, ఏఎన్‌ఎంలు, పీహెచ్‌సీ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



పీహెచ్‌సీ ల్యాబ్‌లో రక్త పరీక్షల రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంఓ డాక్టర్ టి జగన్‌మోహన్‌రావు

విగ్రహాలపై తొలగని ముసుగులు

సాలూరు రూరల్:

ఎన్నికల నిబంధనల ప్రకారం ఎన్నికల్లో పోటీచేసే రాజకీయ పార్టీలకు సంబంధించిన నాయకుల విగ్రహాల ముఖాలు ఎన్నికల కోడ్ సమయంలో ఓటర్లకు కనిపించకుండా వస్త్రాలతో మూసివేస్తారు. అలాగే ఎన్నికల అనంతరం వాటిని తొలగిస్తారు. అయితే ఎన్నికలు ముగిసి 15 రోజులు గడుస్తున్నా సాలూరు మండలంలోని తోణాం గ్రామంలో ఉన్న దివంగత మజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ముసుగు ఇంతవరకు తొలగించలేదు. అలాగే తోణాం నుంచి ఎగువ సెంబి గ్రామానికి రోడ్డు నిర్మాణానికి ఉద్దేశించిన శిలాఫలకానికి వేసిన తెల్ల సున్నం తొలగించలేదు.



తోణాంలో ముసుగుతో ఉన్న రాజశేఖరరెడ్డి విగ్రహం



సున్నం పూసి ఉన్న శిలాఫలకం

ఇలా మండలంలోని పలు శిలాఫలకాలు తెల్ల సున్నం వేసి తొలగించకుండా ఉన్నాయి.

సికిల్ సెల్ ఎనీమియాను నిర్మూలించాలి

పార్వతీపురంటౌన్: సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిని నిర్మూలించుటకు ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని ఐటీడీఏ పీఓ విష్ణు చరణ్, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. జాతీయ సికిల్ సెల్ ఎనీమియా డే సందర్భంగా బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటుచేసిన అవగాహన, ప్రత్యేక నిర్ధారణ కేంద్రం కార్యక్రమాలకు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2047 నాటికి సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే సంకల్పంతో ప్రత్యేక మిషన్‌ను రూపొందించినట్లు తెలిపారు. వ్యాధి ప్రభావిత గిరిజన ప్రాంతాలలో 40 సంవత్సరాల లోపు గల వ్యాధి ఉన్న వారిని గుర్తించేందుకు జూన్ 19 తేదీ నుంచి జూలై 3వ తేదీవరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారని, 40 సంవత్సరాల లోపు వయస్సుగల ప్రజలందరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని పరీక్షలు చేయించుకుని వ్యాధి నిర్మూలనకు సహకరించాలని కోరారు. సికిల్‌సెల్ ఎనీమియా అంటువ్యాధి కాదని, వంశపారపర్యంగా వస్తుందని, దీనిని ముందుగానే గుర్తించి తగు చర్యలు తీసుకోవడం ద్వారా భావితరాలకు సంక్రమించకుండా కాపాడుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ వైద్యఆరోగ్య అధికారి డా. శివకుమార్, ఐటీడీఏ ఏపీఓ పి.మురళీధర్, ట్రైబల్ వెల్ఫేర్ ఉప సంచాలకులు రుక్మాంగదయ్య, ఐటీడీఏ మేనేజర్ యు.వి.పద్మనాభరాజు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



రోగులను అడిగి సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర



రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

జిల్లా ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర జిల్లా ఆస్పత్రిని బుధవారం సందర్శించారు. ఆస్పత్రి ఉద్యోగుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విధులకు వచ్చే వైద్యులు కనీసం హాజరు పట్టికలో సంతకాలు కూడా చేయకపోవడంపై మండిపడ్డారు. రోగులకు ఇచ్చే ఆహారం నాణ్యత కరువైందన్నారు. ఇక్కడికి వచ్చే రోగులు వారి ఆరోగ్యం మెరుగు పడాలని వస్తారు, కానీ ఇక్కడ ఆహారం తిన్నవారు తిరిగి రోగాల బారిన పడే పరిస్థితి ఉందని అసహనం వెలిబుచ్చారు.

ఉపాధిలో తోటల పెంపకం



మాట్లాడుతున్న ఏపీఓ భాను

సీతానగరం: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా వేతన దారులకు పనులు కల్పించడం కోసం తోటల పెంపకానికి ప్రాధాన్యం ఇచ్చామని ఏపీఓ భాను అన్నారు.
ఈ మేరకు బుధవారం ఆయన మండల పరిషత్‌లోని ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం మండల సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు కురవడం వల్ల ప్లాంటేషన్ వేయడానికి వాతావరణం అనుకూలించడంతో చిన్న, సన్నకారు రైతుకు ఆదాయవనరులు కల్పించే తోటల పెంపకం చేయడానికి, వేతనదారులకుపనులు కల్పించడానికి క్షేత్ర సహాయకులు చర్యలు చేపట్టాలని కోరారు. చిన్న, సన్నకారు రైతులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ఎల్లమ్మతల్లి గుడినిర్మాణం పరిశీలన



ఎల్లమ్మతల్లి గుడినిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ బి.రమణమ్మ

సీతానగరం: మండలంలోని పెదంకలాం గ్రామస్తులు ఇలవేల్పుగా కొలిచే ఎల్లమ్మతల్లి గుడి నిర్మాణాన్ని ఎంపీపీ బి.రమణమ్మ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజల కోర్కెలు తీర్చే ఎల్లమ్మ పండగ ప్రతి రెండేళ్లకు ఒక పర్యాయం నిర్వహిస్తున్నామన్నారు. పెదంకలాం గ్రామస్తులతో పాటు పలుగ్రామాలవారు అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారని చెప్పారు. ఈ గ్రామానికి చెందిన వారు ఎంతదూరంలో ఉన్నా పండగ రోజున వచ్చి, భక్తిశ్రద్ధలతో మూడు రోజులూ ఎల్లమ్మ దత్తి కథను జానపద కళాకారులతో ఆలపించడం, భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారని గుర్తుచేశారు. అమ్మవారిపై ఉన్న భక్తితో లక్షలాది రూపాయలు వెచ్చించి గ్రామ శివారులో ఉన్న వనంగుడి స్థలంలో నూతనంగా గుడిని నిర్మిస్తున్నామన్నారు. ఎల్లమ్మతల్లి పండగ వచ్చే సమయానికి గుడి పనులు పూర్తి చేయడానికి చేసిన ప్రణాళికల ఆధారంగా ఆలయ కమిటీ చైర్మన్ బి అప్పలస్వామినాయుడు కుటుంబ సభ్యులు పనులు చేయిస్తున్నారని తెలియ జేశారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ

సీతానగరం: మండలంలోని గ్రామ పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రారంభించిన పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని, ఆ నిధులు ఎంతఖర్చు చేశారో లిఖిత పూర్వకంగా పంచాయతీ కార్యదర్శులు రికార్డుల్లో పొందు పర్చాలని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గ్రామాల్లో జరుగుతున్న, జరిగిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య పనులపై మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా పారిశుధ్య పనులు నిర్వహించాలని, తాగునీరు సరఫరా, క్లోరినేషన్ పనులతో పాటు విద్యుద్దీకరణ పనులను చేయించాలని సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అమలు చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శిలపై ఉందన్నారు.
ప్రతి వారం రోజుల కోసారి గ్రామాల అభివృద్ధిపై సమీక్షించడానికి కార్యదర్శులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయాల కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తాళం భజన పోటీలు



భజన పాటల పోటీల్లో పాల్గొన్న గున్నతోటవలస కాలనీ తాళం భజన బృందం

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురంలో సాయి రాం భజన మండలి సమాజం ఆధ్వర్యంలో జరుగుతున్న డివిజన్ స్థాయి తాళం భజన పోటీలలో మూడోరోజు 11టీమ్‌లు పాల్గొన్నాయని నిర్వాహకుడు సీహెచ్ వెంకటరమణ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాళం భజన పోటీల్లో పాల్గొనేందుకు జానపదకళాకారులంతా ఉత్సాహం చూపిస్తుండడంతో కనుమరుగవుతున్న జానపద కళలకు మంచిరోజులు వస్తున్నాయని, హిందూ సంప్రదాయలకు జీవం పోసే విధంగా ఉందన్నారు. పోటీలలో బొబ్బిలి మండలంలోని గున్నతోటవలస కాలనీ, కొత్తపెంట, పాతపెంట, బలిజిపేట మండలంలోని బర్లి, సీతానగరం మండలంలోని నిడగల్లు, కాశీపేట, రామభద్రపురం మండలంలోని నర్సాపురం, పాచిపెంట మండలంలోని కొత్తవలస, కర్రివలస, విశ్వనాథపురం గ్రామాల తాళం భజన జానపద కళాకారుల టీమ్‌లు పోటీల్లో పాల్గొన్నాయని తెలియజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిర్వాహక కమిటీ పర్యవేక్షణలో పోటీలు నిర్వహించామని చెప్పారు. పోటీల్లో పాల్గొన్న జానపద కళాకారులకు మధ్యాహ్నం భోజనవసతి సౌకర్యం కల్పించినట్లు తెలియజేశారు. పోటీల్లో విజేతలను నిర్వాహక కమిటీ ప్రతినిధుల సమక్షంలో గ్రామపెద్దలతో శాలువాలతో సత్కరించినట్లు తెలిపారు.

21న వాహనాల వేలం

పార్వతీపురంటౌన్: ప్రొహిబిషన్/ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు ఈ నెల 21న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఈబీ సీఐ బి.నరసింహమూర్తి తెలిపారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిపార్ట్‌మెంట్ నిర్ణయించిన ధరావతు వెయ్యిరూపాయలు ముందుగా చెల్లించి టోకెన్ తీసుకుని ఈనెల 21తేదీన ఉదయం 11 గంటలకు పార్వతీపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఆవరణలో జరగనున్న వేలం పాటకు హాజరు కావాలని, ఈ అవకాశాన్ని పాటదారులు వినియోగించుకోవాలని కోరారు.

పాత ఏఎన్‌ఎంలను కొనసాగించాలి



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు, హెల్త్ వలంటీర్లు

సాలూరు: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, పోస్టుమెట్రిక్ వసతిగృహాల్లో గతంలో పనిచేసిన ఆదివాసీ హెల్త్ వలంటీర్ ఏఎన్‌ఎంలను మళ్లీ కొనసాగించాలని పలువురు గిరిజన సంఘాల నాయకులు, హెల్త్ వలంటీర్లు స్త్రీశిశుసంక్షేమ,గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణిని కోరారు. ఈ మేరకు బుధవారం వారు మంత్రిని పట్టణంలోని ఆమె స్వగృహంలో కలిశారు. ఏకలవ్య భవనాల నిర్మాణం, ఉద్యోగుల ఉద్యోగ భద్రత, గురుకులాలు, కళాశాలల్లో సీట్ల పెంపు తదితర సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు.కార్యక్రమంలో నాయకులు పాలక రంజిత్‌కుమార్, పల్ల సురేష్, పాలవలస భగవాన్, రామకృష్ణ, చంద్రశేఖర్, ప్రభాకరరావు, సీతారాం, తమ్మయ్య, బంగారాజు తదితరులు పాల్గొన్నారు.